ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

శనివారం 25 అక్టోబరు 2025

స్థానిక యాప్‌లకు ఆటో, క్యాబ్ డ్రైవర్ల మద్దతు

7


పట్టుతో రైతుకు ఆర్థిక శక్తి
కేంద్రమంత్రి శోభాకరంద్లాజె

బస్సు ప్రమాదం బాధాకరం: సీఎం



కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాదం బాధాకరమని సీఎం సిద్దరామయ్య విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాద ఘటనపై ఎక్స్ ద్వారా స్పందించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వస్తున్న బస్సుకు అగ్ని ప్రమాదం జరిగిందని, ఎంతోమంది సజీవదహనమయ్యారన్నారు. దుర్ఘటనలో మృతి చెందినవారికి సంతాపం తెలిపారు. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అధికారులను పంపాం: మంత్రి రామలింగారెడ్డి



కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాదం విషయం తెలియగానే రవాణాశాఖ అధికారులను పంపినట్టు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదం విషయం తెలియగానే చిక్కబళ్ళాపుర జిల్లా పరిధిలోని అధికారులను ఘటనాస్థలానికి పంపామన్నారు. అక్కడి పరిస్థితిని తెలుసుకుని గాయపడ్డ వారికి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. రవాణాశాఖ అధికారులతోపాటు పోలీసుబృందాన్ని పంపినట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక కమిటీతో విచారణ చేపట్టాలి: డీసీఎం

కర్నూలు బస్సు ప్రమాదం దురదృష్టకరమనీ, ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరినట్లు డీసీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. విధాన సౌధలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణం అనిపిస్తోందన్నారు. అందుకే ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఇది చిన్న సంఘటన కాదని మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సి ఉందన్నారు. ఇటీవలే బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న గ్రీన్‌లైన్ బస్సు ప్రమాదానికి గురైందన్నారు. అప్పుడు రాయచూరు కాంగ్రెస్ అధ్య



క్షుడు, డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో బస్సులోని 20మంది వైద్యవిద్యార్థులు బయట పడ్డారన్నారు. ప్రమాదాలు జరుగుతాయని అయితే పోలీసులు, రవాణాశాఖ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రమాదం పొరుగురాష్ట్రంలో జరిగినా రవాణాశాఖ మంత్రి, హోంమంత్రికి ప్రత్యేకదృష్టి సారించాలని సూచిస్తానన్నారు. కాగా హోం మంత్రి పరమేశ్వర్ ప్రమాద మృతులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరారు.

సత్యసాయి శతజయంతి వేడుకలకు

సీఎంకు ఆహ్వానం

పుట్టపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరగనున్న సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ట్రస్టు సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ట్రస్టు సభ్యుడు నాగానందం బెంగళూరులోని సీఎం కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి సత్యసాయి జయంతి వేడుకలకు హాజరు కావాలని తెలిపారు. కర్నాటక వైట్‌ఫీల్డ్ శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను రత్నాకర్ సీఎంకు వివరించారు.



ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ఆహ్వానిస్తున్న ఆర్‌జే రత్నాకర్

అధికారం కోసమే జేడీఎస్ కాషాయీకరణ : మంత్రి ప్రియాంక ఖర్గే

- ఏడేళ్ల కిందట మీ తండ్రి ఖర్గే.. మా ఇంటికెందుకొచ్చారు?
- బెంగళూరు రాజకీయాలే సరిపోయాయి
- నీ నియోజకవర్గంలో ఏమి జరుగుతుందో తెలుసుకో..
- కేంద్ర మంత్రి కుమారస్వామి ఆగ్రహం

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉద్దేశించి తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్న కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంకఖర్గే తాజాగా జేడీఎస్ పార్టీ తీరుపైన విరుచుకుపడ్డారు. అధికారం కోసం సెక్యులర్‌పేరిట ఉండే జేడీఎస్ పార్టీ కాషాయీకరణ గా మారిందన్నారు. పార్టీలోని సెక్యులర్ పదాన్ని తీసేయాలని సూచించారు. మంత్రి ప్రియాంక వ్యాఖ్యలపై కేంద్రమంత్రి, జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన జేడీఎస్ పట్ల అనుచితంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. 2018 శాసనసభ ఎన్నికల తర్వాత మీ తండ్రి, ప్రస్తుత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే మా ఇంటి తలుపులు ఎందుకు తట్టారో తెలుసుకోవాలన్నారు. బెంగళూరులో రాజకీయం చేస్తున్నానని అంతా తనకే తెలుసని భావించకుండా ముందుగా మీ జిల్లాలో ఏం జరుగుతోందో గుర్తించాలన్నారు. జేడీఎస్‌ను విమర్శించడం కొందరు ఫ్యాషన్‌గా భావిస్తున్నారని, చులకనగా మాట్లాడితే సహించేది లేదన్నారు. కలబురగి జిల్లాలో వరదలతో ప్రజలు తల్లడిల్లుతుంటే పరామర్శించి ఆదుకుంటామని ధైర్యం చెప్పేవారు లేరన్నారు. కాంగ్రెస్‌వారు ప్రతిసారి తాజ్ హోటల్‌నుంచి పాలన సాగించారని ఆరోపణలు చేస్తారని, తాను రైతులకు రూ.25వేల కోట్ల రుణమాఫీ చేశానని, ప్రస్తుతం మీరేం చేశారో పరిశీలించుకోవాలన్నారు. పార్టీపై అవాకులు, చవాకులు పేలరాదన్నారు.

ప్రాణాలు పోయాకే..
పరుగులు



- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మారని అధికారుల తీరు
- రెండు రోజులే దాడులు, హడావుడి తనిఖీలు
- 12 ఏళ్ల క్రితం ఇదే తరహా ప్రమాదం... అన్నీ మానవ తప్పిదాలతోనే
- నాడు బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా..
- హావేరి, హుబ్బళ్ళిల్లో ఇటువంటి ఘటనలే..

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదం జరిగినప్పుడు వాటి కారణాలను వెలికితీసి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రం ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు చూపించే నిబంధనలు, ఆత్రుత నిర్ణయాలు, హడావుడి దాడులు ఆ తర్వాత ఆచరణలో కొనసాగవని అందరికీ తెలిసిందే. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయల్దేరిన కావేరి బస్సు కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదానికి గురైంది. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి వందల మీటర్ల మేర బస్సుకిందనే బైక్ తోసుకుపోవడంతో రాపిడికి చెలరేగిన మంటలతో అర్ధరాత్రి తర్వాత కునుకుతీసిన 19మంది ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. అప్రమత్తమైనవారు బతకడంతోపాటు మరింతమందిని కాపాడారు. ఘోరమైన ప్రమాదంతో ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. అయితే అప్పటికప్పుడు ప్రభుత్వం ప్రకటించే ఎక్స్‌గ్రేషియాలు ఎలా ఉన్నా, ఆ తర్వాత కేసులు, ఎనలేని నిబంధనలతో మృతుల కుటుంబాలు ఎన్నో కష్టాలు పడాల్సి వస్తోంది. అయితే తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అటు ప్రైవేట్ ట్రావెల్స్ కానీ , రవాణా శాఖ అధికారులు కానీ పకడ్బందీ చర్యలు తీసుకోవడం లేదు. రెండు రోజులు హడావుడి చేసేసి చేతులు దులుపుకుంటున్నారు.



హుబ్బళ్లి ప్రమాదంలో నుజ్జయిన బస్సు (ఫైల్)



45 మందిని బలిగొన్న మహబూబ్ నగర్ ప్రమాదం (ఫైల్)

నాడు హైదరాబాద్ వెళ్తుండగా..

- 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన నేషనల్ ట్రావెల్స్ బస్సు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో మంటలు చెలరేగాయి. బస్సు తలుపులు సకాలంలో తెరుచుకోకపోవడం, అప్పటికే పొగ చుట్టుకుపోవడంతో నిద్ర నుంచి మేలుకున్నా ఏం జరుగుతోందో గమనించేలోపే మంటల్లో చిక్కుకున్నారు. ఏకంగా 45మంది దుర్మరణం చెందిన సంఘటన జాతీయ, అంతర్జాతీయస్థాయిలో చర్చనీయాంశం అయ్యింది. 2024 జూన్ 28న హావేరి జిల్లాలో ప్రైవేట్ బస్సు, టెంపో ట్రావెలర్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో 13మంది దుర్మరణం చెందారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్

- 2022 మే 25న హుబ్బళ్ళి జిల్లా పరిధిలో ప్రైవేట్ బస్సును లారీ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 8మంది మృత్యువాత చెందారు. ఇలా తరచూ ప్రమాదాలు పదులసంఖ్యలో తమ గమ్యాలకు చేరుకోవాలని ప్రయాణిస్తున్నవారు అసువులు బాస్తున్నారు. కొన్నిశాఖల అధికారుల పనితీరు ఎలా ఉందంటే ఒక సంఘటన జరిగినప్పుడే ఎనలేని దాడులు చేసి నిబంధనలు అమలు చేస్తారు. ఆ తర్వాత వాటిని వదిలేస్తారు. బస్సు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తారు. అప్పుడే బస్సుల పరిశీలన, సంబంధిత రికార్డులను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత పెడచెవిన పెడతారు. ట్రావెల్స్ పేరిట అనుమతులు పొంది రోజూ ఒకే ప్రాంతానికి బస్సులు నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోజూ రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలైన దక్షిణకన్నడ, బెళగావి, బాగల్కోటె, హుబ్బళ్ళి, చిక్కమగళూరు, ఉడుపి, ఉత్తరకన్నడ, బిజాపూర్, బీదర్ వంటి ప్రాంతాల్లోని ప్రధాన నగరాలు, పర్యాటక కేంద్రాలకు అనువుగా ఉండేలా వందలాది బస్సులు బయల్దేరుతాయి. ఇక పొరుగు రాష్ట్రాలోని ప్రధానమైన నగరాలకు బెంగళూరు నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ నడుపుతున్నారు. కేవలం బెంగళూరు నుంచే వేలాది ప్రైవేట్ బస్సులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా తిరిగే ప్రైవేట్ బస్సులు అన్నింటినీ పరిశీలిస్తే ఎన్ని అక్రమంగా సాగుతున్నాయో తేటతెల్లం కానుంది. బస్సులు సజావుగా ప్రయాణం ముగిస్తే సరే. లేదంటే బస్సుకు పర్మిట్‌లు, బీమా వంటివి లేకుంటే బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా తప్ప ఎలాంటి పరిహారం అందే అవకాశం ఉండదు. ప్రైవేట్ బస్సులపై రవాణాశాఖ నిఘా కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శుక్రవారం నగరంలో అధికారులు సీజ్ చేసిన ప్రైవేట్ బస్సులు

రూ.135 కోట్ల డివిడెండ్ అందజేత



చెక్కుతో సీఎం, డీసీఎం తదితరులు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సోప్స్, డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) 135 కోట్ల రూపాయల డివిడెండ్ చెక్కును ముఖ్యమంత్రికి శుక్రవారం అప్పగించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1700 కోట్ల లావాదేవీలు సాగగా రూ.451 కోట్ల లాభం దక్కింది. సాధారణంగా లాభంలో 30శాతం ప్రభుత్వానికి డివిడెండ్‌రూపంలో అందచేస్తారు. అందుకు అనుగుణంగా రూ.135 కోట్లు ఇచ్చారు. 2022-23లో 54 కోట్ల రూపాయలు, 2023-24లో రూ.108 కోట్ల డివిడెండ్ వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే రూ.27 కోట్లు పెరిగినట్టయ్యింది. డీసీఎం డీకే శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, పారిశ్రామిక విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సెల్వకుమార్, సంస్థ ఎండీ డాక్టర్ పీకే ప్రశాంత్ ఉన్నారు.

రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యం

● హంద్రీనీవాకు నిధులిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు ● హెచ్ఎల్ఎంసీకు 50టీఎంసీల నీరు రాబట్టాలి ● రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
● తారతమ్యాలు లేకుండా నీటి కేటాయింపులు: కలెక్టర్ ● ఐఏబీ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యేల చర్చ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో సాగు నీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐఏబీ చైర్మన్, కలెక్టర్ ఆనంద్ అధ్యక్షత న నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌కి నిధులు కేటాయించి పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతాంగం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపారు. వందరోజుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి చేయడం అద్భుతమని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను అభినందించారు. టీబీ డ్యాంలో నీటి నిల్వ తగ్గినా హెచ్చెల్సీకి కేటాయించిన నీటిని తీసుకోవాలని, శ్రీశైలం డ్యాంనుంచి ఈ దఫా హంద్రీనీవాకు 50టీఎంసీల నీటిని రాబట్టడమే లక్ష్యంగా ఇంజనీర్లు పనిచేయాలని కోరారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించినప్పుడే రైతుల విశ్వాసాన్ని చూరగొనగలమన్నారు. సాగు చేసిన పంట ఇంటికి చేరే వరకు అన్నదాతకు అండగా ఉంటామన్నారు. నీటి కేటాయింపులు, నిర్వహణకు ఇంజనీర్లు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 40ఏళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా నీటి కేటాయింపులు జరగడంపై ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేయడం ఇదే తొలిసారన్నారు. ఇదంతా సీఎం చంద్రబాబు చొరవతోనే సాధ్యమైందని తెలిపారు. హంద్రీనీవాకు రూ.3800 కోట్లు నిధులు కేటాయించి కాలువ వెడల్పు, లైనింగ్ పూర్తి చేయడం చంద్రబాబుకు రైతులపై ఉన్న నిబద్ధత, అభిమానానికి నిదర్శనమని కొనియాడారు. నీటి క్యాలెండర్‌ను రూపొందించి ప్రతి ఏటా నిర్దిష్టమైన కార్యాచరణను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి దూర దృష్టితోనే ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందుతోందని హర్షం వ్యక్తం చేశారు.

● కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యవసాయానికి హంద్రీనీవా కాలువ వెడల్పు అత్యవసరమని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈక్రమంలోనే నిధులు కేటాయించి, పనులు పూర్తి చేసిందన్నారు. ఇందుకోసం చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కళ్యాణదుర్గంలోని చెరువులను హెచ్చెల్సీ, హంద్రీనీవా నీటితో నింపాలని కోరారు.

● శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ మాట్లాడుతూ ఎంపీఆర్ ఆధునికీకరణ, గేట్ల మరమ్మతులకు రూ.5.5కోట్లు నిధులు ఇచ్చి, ఆయకట్టుకు 150రోజులపాటు సాగునీటి సరఫరాకు సహకరించిన సీఎం చంద్రబాబు, ఆర్థికమంత్రికి నియోజకవర్గ రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు శింగనమల చెరువుకు ఒక టీఎంసీల నీరు ఇవ్వాలని కోరారు.

● తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నడూలేనివిధంగా తాడిపత్రి నియోజకవర్గానికి సాగు నీరు కేటాయించి, సరఫరా చేస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సౌత్‌కెనాల్ మరమ్మతుకు అవసరమైన నిధులు కేటాయించి అదనంగా 20వేల ఎకరాల ఆయకట్టు సాగుకు సహకరించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన డిస్ట్రిబ్యూటరీల పటిష్టం చేయాలని పేర్కొన్నారు.


ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

● అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని రుద్రంపేట, రూరల్, రాజీవ్‌కాలనీ, నారాయణపురం గ్రామ పంచాయతీలతో పాటు ఇతర పంచాయతీలకు తాగునీరు కేటాయించాలని కోరారు. నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి మైనర్ ఇరిగేషన్ ద్వారా నిధులు ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో నడిమివంక ప్రభావంతో కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.

● ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ.. ఐఏబీ సమావేశం మూడు నెలలు ఆలస్యంగా నిర్వహించడంతో నీటి కేటాయింపులు, విడుదల తేదీల జాప్యంతో రైతులకు నష్టం జరుగుతోందని తెలిపారు. పీఏబీఆర్ పూర్తి సామర్థ్యం 11.6టీఎంసీల నీటి నిల్వకు అవసరమైన భూసేకరణ వెంటనే చేపట్టాలన్నారు. అటు హెచ్చెల్సీ, ఇటు హంద్రీనీవాలకు కలిపి అదనంగా జిల్లాలో ఓ రిజర్వాయర్‌ను నిర్మించాలన్నారు. లస్కర్ పోస్టులను భర్తీ చేసి, ఇరిగేషన్‌కు నిధులు కేటాయింపులు పెంచాలన్నారు. హంద్రీనీవా వెడల్పు, లైనింగ్‌కు నిధులు కేటాయించి పూర్తి చేయడం అభినందనీయమన్నారు.

● జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కాలువల మీద విధులు నిర్వహించి, నీటిని కాపాడే లస్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కాలవల నుంచి నీరు వృథా కాకుండా అరికట్టి, రైతుల పంటలను కాపాడాలని తెలిపారు.

● జిల్లా కలెక్టర్, ఐఏబీ చైర్మన్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాకు ప్రధాన నీటి వనరులు అయిన హంద్రీనీవా, హెచ్చెల్సీ ప్రాజెక్టుల పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి నీటి కేటాయింపులలో ఎటువంటి తారతమ్యాలు లేకుండా లెక్కలు సరిచేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం అధికారులను సమన్వయం చేసుకుని ముందుకెళ్తామని తెలిపారు.

● జలవనరుల ప్రాజెక్టుల సీఈ నాగరాజు, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్ రావు, టీబీ డ్యాం ఎస్ఈ నారాయణనాయక్‌లు నీటి కేటాయింపులు, విడుదల తేదీలతో పాటు చేసిన పురోగతి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ ప్రాజెక్ట్ చైర్మన్ జోగిరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, హంద్రీనీవా, హెచ్చెల్సీ, ఎంఐ ఈఈలు, డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.


ఐఏబీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

క్రైం కార్నర్

అప్పుల మగ్గానికి మరో నేతన్న బలి


నాగరాజు (ఫైల్)

బత్తలపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అప్పుల మగ్గం నేతన్నలను కబళిస్తోంది. గురువారం ధర్మవరంలో చేనేత కార్మికుడు రాజేశ్ మగ్గానికి ఉరేసుకున్న ఘటనను మరువకనే తాజాగా మండలంలోని పోట్లమర్రిలో నాగరాజు (30) మగ్గానికి వేలాడాడు. అప్పుల బాధ భరించలేక శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని, మరణించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు సొంత మగ్గం నేసుకుంటూ జీవనం సాగించేవాడు. మగ్గం గిట్టుబాటు కాక అప్పులపాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి భారీ వర్షం కురుస్తుండడంతో భార్య లక్ష్మి, కుమారులు మణికంఠ, గణేష్‌. అదే ఊరిలోని అత్తగారి ఇంటికి పంపాడు. తెల్లవారుజామున ఇంట్లోనే మగ్గానికి ఉరేసుకున్నాడు. కుమారులు మణికంఠ, గణేష్ వచ్చి తలుపులు కొట్టగా ఎంతసేపటికీ తీయలేదు. వారు వెళ్లి తల్లి లక్ష్మికి విషయం తెలిపి బంధువులతో కలిసి వచ్చారు. తలుపులు బద్దలు కొట్టి చూడగా నాగరాజు మగ్గానికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నేతన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మోసగించిన ప్రేమికుడి అరెస్ట్

శింగనమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిని శింగనమల పోలీసులు అరెస్టు చేశారు. శింగనమల పోలీస్‌స్టేషన్‌లో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో యువకుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని సోదనపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు హరిప్రసాద్ అలియాస్ హర్షవర్ధన్ మాయమాటలతో బాలికకు దగ్గరయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెను మోసం చేశాడు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శుక్రవారం ఆ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

అనంతపురం క్రైం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కళ్యాణదుర్గం మండలం మారంపల్లి కాలనీకి చెందిన బోయ రాజశేఖర్‌కు జీవిత ఖైదు పడింది. మరో రూ.2 వేలు జరిమానా కూడా విధిస్తూ అనంతపురం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. కళ్యాణదుర్గం మండలం మారంపల్లి కాలనీకి చెందిన తలారి నాగరాజు, తన స్నేహితులైన చాకలి అంజి, బోయ రాజశేఖర్‌తో కలిసి 2020 జులై 19న జూదం ఆడుతూ డబ్బు విషయంలో గొడవపడ్డారు. బోయ రాజశేఖర్ దాడి చేయడంతో తలారి నాగరాజు తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో పడిపోయాడు. బాధితున్ని అనంతపురం జీజీహెచ్‌కు తరలించగా, మరుసటి రోజు మరణించాడు. మృతుడి భార్య తలారి ఉష ఫిర్యాదు మేరకు అప్పటి కళ్యాణదుర్గం రూరల్ సీఐ శివశంకర్ నాయక్ దాడి చేసిన బోయరాజశేఖర్‌పై హత్య కేసు నమోదు చేశారు. తర్వాత సీఐగా వచ్చిన తేజోమూర్తి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. సుమారు 10 మంది సాక్షులను విచారించగా, నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో న్యాయాధికారి బోయ రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై పోక్సో కేసు

గార్లదిన్నె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన అశోక్ గార్లదిన్నెలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గార్లదిన్నె సమీపంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడి చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో శుక్రవారం తలగాసిపల్లి జంక్షన్ వద్ద ఉన్న అశోక్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఇద్దరు జవాన్ల మృతి


అమర్‌నాథ్ (ఫైల్)

పెద్దవడుగూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనారోగ్యంతో బాధపడుతూ ఇద్దరు జవాన్లు శుక్రవారం మృతిచెందారు. పెద్దవడుగూరు మండలంలోని అప్పేచర్ల గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాను అమర్‌నాథ్ (42) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకోగా.. తీవ్ర తలపోటు రావడంతో కుటుంబ సభ్యులు డిఫెన్స్ ఆస్పత్రికి తరలించారు. తలలో రక్తనాళాలు గడ్డ కట్టడంతో గురువారం రాత్రి మరణించారు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జవాను మృతదేహం వద్ద తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాళులు అర్పించారు. జవానుకు భార్య సుకన్య, కుమారుడు తిమ్మిస్, కుమార్తె దీపిక ఉన్నారు.


శామ్‌ప్రసాద్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన జవాను శ్యామ్‌ప్రసాద్(35) శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ, లక్ష్మీదేవమ్మల పెద్దకుమారుడు వెంకటనాయుడు జమ్మూ కశ్మీర్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు శ్యామ్‌ప్రసాద్ ఆర్మీలో పంజాబ్‌లో పనిచేస్తున్నాడు. సెప్టెంబరు 6న దసరా పండగకు శెట్టిపల్లికి వచ్చాడు. అక్టోబరు 6న తిరిగి విధుల్లో చేరాడు. వారం రోజుల కిందట జ్వరం రాగా పంజాబ్‌లోని జలంధర్ ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం 12.30కు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.మృతుడికి భార్య శ్రావణి, ఇద్దరు కుమారులున్నారు.

కూతురిపై తల్లి విజయం

ఆదరించనందుకు భూమిని తిరిగి పొందిన లక్ష్మమ్మ

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి.. భూమిని రాయించుకుని.. ఆ తర్వాత పట్టించుకోని కూతురిపై అమ్మ గెలిచింది. దాన విక్రయం కింద కూతురికి రాసిచ్చిన భూమిని రెవెన్యూ కోర్టు ద్వారా తిరిగి పొందింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లోనికోటకు చెందిన గుంజర లక్ష్మమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె లక్ష్మీదేవికి 596-1 సర్వే నంబరులో 59.50 సెంట్ల స్థలాన్ని లక్ష్మమ్మ దాన విక్రయం చేసింది. కొన్ని రోజులు లక్ష్మీదేవి.. తల్లిని బాగా చూసుకుంది. ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో లక్ష్మమ్మ తీవ్ర ఇబ్బందులు పడింది. ఆర్డీఓ కోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఫిర్యాదు చేసింది. దానిని సీరియస్‌గా తీసుకున్న ఆర్డీఓ మహేశ్.. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులతో పలుమార్లు విచారణ చేపట్టారు. లక్ష్మమ్మను కుమార్తె లక్ష్మీదేవి ఇబ్బందులు పెట్టింది వాస్తవమేనని తేలింది. దీంతో కుమార్తె లక్ష్మీదేవికి దాన విక్రయం చేసిన స్థలాన్ని రెవెన్యూ కోర్టుద్వారా తిరిగి లక్ష్మమ్మకు అప్పగిస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం లక్ష్మమ్మకు అందజేశారు.


స్థలాన్ని తిరిగి లక్ష్మమ్మకు అప్పగిస్తూ ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్డీఓ

చిలకం మధుకి భద్రత కల్పించండి

● పోలీసులకు హైకోర్టు ఆదేశం

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి భద్రత (1+1) కల్పించాలని గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. చిలకం మధుసూదన్‌రెడ్డి కుటుంబ నేపథ్యం, రాజకీయ హోదాను దృష్టిలో ఉంచుకుని 2020 జూలై 22న ప్రభుత్వం (1+1) భద్రత కల్పించింది. తరువాత రాజకీయ కక్షతో అదే ఏడాది సెప్టెంబరు 15న భద్రతను తొలగించారు. అప్పట్లో హైకోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వం భద్రతను కొనసాగించాలని ఆదేశించింది. తరువాత రాజకీయ కక్షతో 2021 నవంబరు 23న భద్రతను తొలగించారు. దీంతో భద్రతను కొనసాగించేలా పోలీసులను ఆదేశించాలని చిలకం మధుసూదన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి, దాఖలు చేశారు. గురువారం ఈ కేసు విచారణ చేపట్టిన జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయ ప్రతాప ఆధ్వర్యంలోని ఏకసభ్య ధర్మాసనం చిలకం మధుసూదన్‌రెడ్డికి (1+1) వ్యక్తిగత భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. చిలకం మధుసూదన్‌రెడ్డి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నవంబరు, డిసెంబరు నెలల్లో గుంతకల్లు మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య వారానికి రెండు రోజుల (బైవీక్లీ) ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (06539) ప్రత్యేక రైలును నవంబరు 2 నుంచి డిసెంబరు 28 వరకూ శుక్ర, ఆదివారాలలో 17 ట్రిప్పులను నడుపుతామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06540)ను నవంబరు 3 నుంచి 29 వరకూ ప్రతి శని, సోమవారాల్లో 17 ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహాబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

జవాబుదారీగా పని చేయాలి: డీఆర్ఎం

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో శుక్రవారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. నైతికతను కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని డీఆర్ఎం సూచించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ వెల్లడించారు. తెలిపారు. ఎంపికైన జట్టులో పృథ్వీరాజ్, జగదీష్, మహేష్, సింహాద్రి, తరుణ్‌సాయి, సాయివెంకట్, లక్ష్మీకళ్యాణ్, లక్ష్మీనారాయణ, వినోద్, అరవింద్‌రెడ్డి, జయవర్ధన్ చౌదరి, ప్రశాంత్, సాయి జస్విక్‌రెడ్డి, అక్షయసాగర్, సాయివినయ్, వరుణ్ ఉన్నారు. స్టాండ్‌బైలుగా జయచంద్ర, మోక్షిత్‌వర్మ, బానుశంకర్, అరవింద్, సతీష్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరు నవంబరు 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ ప్రభాకర్, ప్లేయర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సుకన్య సమృద్ధియోజన ద్వారా పేద విద్యార్థినులకు ఆర్థిక చేయూత అందించనున్నట్లు డీఈఓ క్రిష్టప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం శ్రీసత్యసాయిజాతీయసేవా ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ శశిబాల ఆధ్వర్యంలో ఖాతాలు తెరవడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎస్సీ ఎస్టీ బీసీ పేద విద్యార్థినులను గుర్తించి వారిఖాతాల్లో కొంతమేర సొమ్మును ప్రభుత్వం జమ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, తపాలా సిబ్బందికి విద్యార్థినుల (పదేళ్లలోపు బాలికలు) ఆధార్, తరగతి వివరాలను అందచేయాలన్నారు.

రేపు వాల్మీకి, బోయ టీచర్లకు సత్కారం

అనంతపురం విద్య, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన వాల్మీకి, బోయ టీచర్లకు ఈనెల 26న ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేసినట్లు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్ తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ తీవ్ర పోటీ ఉన్న డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం వాల్మీకి బిడ్డలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. అందుకే వాల్మీకి కులబంధువుల సమక్షంలో సత్కరించాలనే ఈ ఆత్మీయ సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోమ్‌లో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

ఏడాదికో దూడ చాలు

● పాడి రైతులకు జేడీ సూచన

శింగనమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఏడాదికో దూడ అనే నియమాన్ని పాటిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) ప్రేమ్‌చంద్ సూచించారు. దూడలు కూడా బాగా ఎదుగుతాయన్నారు. మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. జేడీ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. పాడిరైతులు తమ పశువులు ఈనిన 60 రోజుల్లోపే తిరిగి కట్టించాలని చూస్తున్నారన్నారు. తద్వారా పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. ఎస్ఎస్ఎస్ వీర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామనీ, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్, రమేష్‌రెడ్డి, పద్మనాభయ్య కిరణ్‌కూమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నత్తల నివారణకు చర్యలు

అమడగూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ సమీపంలోని గొల్లపల్లి పరిధిలో నత్తల నివారణకు అధికారులు కదిలారు. అవి పంటలను దెబ్బతీస్తున్న విధానంపై 'నత్తల దండు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. శుక్రవారం ఉద్యాన శాఖాధికారి లావణ్య ఆధ్వర్యంలో పొలాలను పరిశీలించారు. నత్తల నివారణకు 250 గ్రాముల కాపర్ సల్ఫేట్, ఫెర్రస్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి, ఎకరానికి పిచికారీ చేయించారు. ఈ ద్రావణానిన డ్రిప్ ద్వారా కూడా సరఫరా చేసుకోవచ్చని ఉద్యాన శాఖాధికారి సూచించారు. పొలం చుట్టూ రాళ్ల ఉప్పు వేస్తే పంటలోకి నత్తలు చొరబడకుండా నివారించవచ్చన్నారు. పొలం చుట్టూ బొప్పాయి మొక్కలు పెంచితే వీటి ప్రభావం పంటపై ఉండదన్నారు. పంటలో కొన్నిచోట్ల బొప్పాయి ఆకులను ఏర్పాటుచేస్తే నత్తలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటరమణాచారి, సిబ్బంది బాబ్జాన్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వెంకటేష్, రవి పాల్గొన్నారు.

క్యాంపు రాజకీయం..!

బీకేఎస్ ఎంపీపీపై అవిశ్వాసం నేపథ్యంలో ఉత్కంఠ

వైసీపీ శిబిరానికి ఓ ఎంపీటీసీ డుమ్మా

ఓ సభ్యుడి కిడ్నాప్ కలకలం..!



బుక్కరాయసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. శిబిరానికి ఓ ఎంపీటీసీ గైర్హాజరవడం, మరో సభ్యుడిని కిడ్నాప్ చేశారంటూ ప్రచారం నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు ఇటు వైసీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్, ఇటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ నెల 30న బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీతపై వైసీపీ నేతలు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. ఇప్పటికే 12 మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులను శిబిరానికి తరలించినట్లు సమాచారం. మద్దతు కూడగట్టేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

13 మంది మద్దతు అవసరం

మండలంలో మొత్తం 19 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 13 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్నికల్లో 14 ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అప్పటి ఎమ్మెల్యే పద్మావతిపై అసంతృప్తితో ఎంపీపీ సునీత.. ఎన్నికలకు ముందు టీడీపీలోకి చేరారు. అందుకు టీడీపీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమెతో పార్టీకి సంబంధంలేదని టీడీపీ జోనల్ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర ఎన్నికలకు ముందు ప్రకటించారు. అయినా ఆమె.. పార్టీలో పరోక్షంగా పనిచేశారు. దీంతో ఆమెను కొనసాగించేందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పట్టుబట్టారు. వైసీపీ సభ్యులు 13 మంది ఉన్నారు. టీడీపీ సభ్యులు ఐదుగురు, ఎంపీపీతో కలిసి బలం ఆరుకి చేరుతుంది. ఎంపీపీ సునీతను టీడీపీకి చెందిన కొందరు ఎంపీటీసీలు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. సునీత కాకుండా వేరెవ్వరికైనా మద్దతు ఇస్తామని ఒకరిద్దరు చెబుతున్నట్లు తెలుస్తోంది. బుక్కరాయసముద్రం వైసీపీ ఎంపీటీసీ-3 శిరిజ ఆ పార్టీ శిబిరానికి డుమ్మా కొట్టారు. ఆమె ఆచూకీ కోసం వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. 30న జరిగే సమావేశానికి గైర్హాజరు చేసేందుకు ఎంపీపీ దాసరి సునీత తీవ్ర పయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీ ఎంపీటీసీలను కలిసి, మద్దతు కోరినట్లు సమాచారం.

కిడ్నాప్ కలకలం

మండలంలోని కేకే అగ్రహారం ఎంపీటీసీ రామచంద్రను కిడ్నాప్ చేసినట్లు గురువారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన సీఐ పుల్లయ్య, సిబ్బంది ఎంపీటీసీ రామచంద్రను స్టేషన్‌కు పిలిపించి, విచారించారు. రాత్రి 12 గంటల వరకు స్టేషన్‌లో విచారణ చేయడంతో వైసీపీ శిబిరంలో ఆందోళన మొదలైంది. తిరిగి వైసీపీ ముఖ్యనేతలు.. రామచంద్రతో మాట్లాడారు. అనంతరం తనను కిడ్నాప్ చేయలేదని రామచంద్ర చెప్పడంతో పోలీసులు పంపించేశారు. వైసీపీ శిబిరంలోకి వెళ్లినట్లు తెలిసింది.

జగన్ వ్యాఖ్యలపై

టీడీపీ నిరసన


అంబేడ్కర్ సర్కిల్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

హిందూపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ నాయకులు నిరసించారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శుక్రవారం ఆందోళన చేస్తూ, జగన్ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, ఎస్ఐ శ్రీధర్ నిరసనకారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మునిసిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బాలకృష్ణను కించపరుస్తూ మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీవారు చేసిన అరాచకాలు, దౌర్జన్యాల వల్లే ప్రజలు 11సీట్లకే పరిమితం చేశారన్నారు. సైకో జగన్ అంటూ నినాదాలు చేశారు. బాలకృష్ణకు క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ అనిల్, నాయకులు నాగరాజు, ఆనంద్, రాము, మంగేష్, బాచి, అమర్, మంజునాథ్ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవం

పెద్దపప్పూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాన్ని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి జూటూరులోని జేసీ దివాకర‌రెడ్డి అగ్రికల్చర్ కాలేజీలో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంపొందించినందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏఎస్పీ చాగల్లు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఆయన వెంట సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆచంట వెంకట సాంఖ్యాయనశర్మ (జయంతి)



తొలితరం తెలుగు కథకుడు, ఆచంట వెంకట సాంఖ్యాయన శర్మ తూర్పు గోదావరి జిల్లా ఆచంట గ్రామంలో 1864 అక్టోబరు 25న జన్మించారు. బాల్యంలోనే సంస్కృతాంధ్ర భాషలలో విశేషమైన పాండిత్యం గడించారు. కవిత్వం, చిత్రలేఖనం, గాయనం, నృత్యం మొదలైన కళలన్నీ అభ్యసించారు. సుజన ప్రమోదిని, కల్పలత అనే పత్రికలు నడిపారు. శతావధానాలు కూడా చేశారు. మేరంగి సంస్థానంలో దివానుగా పని చేశారు. ఆంధ్ర నాటక కళాపరిషత్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. సుధానిధి, మనోరమ అనే పద్య కావ్యాలు, 'ఆంధ్ర పంద్యావళి' అనే ఖండకావ్య సంపుటి, ఇతర రచనలు ఎంతో పేరొందాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తువారు 'మహోపాధ్యాయ'తో గౌరవించారు. 1933లో కన్నుమూశారు.

పాబ్లో పికాసో (జయంతి)



ఇరవయ్యో శతాబ్దంలో పేరొందిన స్పానిష్ దేశ శిల్పి, చిత్రకారుడు పాబ్లో పికాసో 1881 అక్టోబరు 25న జన్మించారు. చిత్రలేఖనంలో క్యూబిజంను ప్రోత్సహించిన కళాకారుడు. 1901లో తల్లిప్రేమ, 1937లో 'గుయెర్నికా' చిత్రం, ఇంకా 'లే డెమొసెల్లిస్ డి అవినాన్' గొప్ప కళాఖండాలుగా పేరొందాయి. 1962లో లెనిన్ శాంతి బహుమతి పొందారు. 1973 ఏప్రిల్ 8న కన్నుమూశారు.

మధురై మణి అయ్యర్ (జయంతి)



కర్ణాటక సంగీత గాయకుడిగా రాణించిన మధురై మణి అయ్యర్ 1912 అక్టోబరు 25న తమిళనాడు రాష్ట్రం మదురైలో జన్మించారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్, జీఎన్ బాల సుబ్రమణియమ్‌లతో కలసి 'సంగీత త్రయం'గా కొనసాగారు. రాగ ఆలాపనలో, స్వరాలలో తనదైనశైలితో ఆకట్టుకున్నారు. సంగీత కళానిధి, ప్రెసిడెంట్స్ అవార్డు, గాన కళాధరర్, ఇసై పెరారిజ్ఞార్ తదితర పురస్కారాలు పొందారు. 1968 జూన్ 8న కన్నుమూశారు. నేటికీ ఆయన సంగీతం శ్రోతలను అలరిస్తోంది.

కేటి పెర్రి (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన గాయని, గేయ రచయిత కేటి పెర్రి 1984 అక్టోబరు 25న జన్మించారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తు న్నారు. 'అమెరికన్ ఐడల్' కార్యక్రమంతో పేరొందారు. 18 మిలియన్ ఆల్బమ్స్, ప్రపంచవ్యాప్తంగా 125 మిలియన్ సింగిల్స్ అమ్ముడయ్యాయి. 'ఆల్‌టైం పాప్ సాంగ్ ఆర్టిస్ట్' జాబితాలో 4వ ర్యాంకులో నిలిచారు. నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డులతోపాటు పలు అవార్డులు పొందారు. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ బాధ్యతలు చేపట్టినవేళ 'సెలెబ్రేటింగ్ అమెరికా' కార్యక్రమంలో పాల్గొన్నారు. 350 మిలియన్ డాలర్లతో ఫోర్బ్స్ 2024లో ప్రకటించిన 'అమెరికాస్ రిచెస్ట్ సెల్ఫ్ మేడ్ ఉమెన్'లలో ఒకరిగా నిలిచారు.

హాస్టళ్ల బలోపేతానికి జాగృతి



ర్యాలీలో విద్యార్థులు తదితరులు

బాగేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్య మనుగడ కోసం, హాస్టళ్ల బలోపేతానికి ఎస్ఎఫ్ఐ ప్రత్యేక జాగృతి నిర్వహించింది. హాస్టళ్లలోని విద్యార్థుల ఆహారభత్యం పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఈనెల 29, 30 తేదీలలో హావేరి గురుభవన్‌లో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని బాగేపల్లి తాలూకా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. తొలుత జీవీ శ్రీరామరెడ్డి విగ్రహానికి పూలహారం వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు తగ్గుతున్నాయని, ఉన్న వాటిలో గుణాత్మకత పెంచే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు శాస్త్రీయమైన పాలసీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హాస్టళ్లలో సరైన మౌలిక సదుపాయాలు లేవని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం తాలూకా ప్రముఖులు రఘురామరెడ్డి, చన్నరాయప్ప, ముస్తఫా, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో పాల్గొన్న వైద్యబృందం

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ డాక్టర్ల సలహాలు లేకుండా నిర్లక్ష్యం చేయరాదని పలువురు వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు. హృదయ, శ్వాసకోశ సమస్యలపై రివైవ్ 2025 పేరిట అంతర్జాతీయ సదస్సు శుక్రవారం నగరంలో జరిగింది. వాయు చెస్ట్ అండ్ స్లీప్ స్పెషాలిటీ సెంటర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. వాయుచెస్ట్ సెంటర్ ఫౌండర్ డాక్టర్ రవీంద్ర మెహతా, డాక్టర్ యోగితాలు పర్యవేక్షించారు. రవీంద్ర మెహతా మాట్లాడుతూ వైద్యరంగంలోనూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోందని అందుకు అనుగుణంగా డాక్టర్లు అప్‌డేట్ కావాల్సి ఉందన్నారు. రివైవ్ పేరిట ఏర్పాటు చేసిన సదస్సుకు అమెరికా నుంచి డాక్టర్ గణేశ్ రఘు, యూకే నుంచి డాక్టర్ శ్యాలిసింగ్, బెల్జియం రికీ గోస్లింక్, అమెరికాకు చెందిన మేరీబెత్ బ్రౌన్‌లు వర్చువల్ రూపంలో భాగస్వామ్యులయ్యారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ కార్డియో వాస్కులర్ పల్మనరీ అండ్ రిహాబిలిటేషన్, హెల్త్ స్పెసిఫిక్స్ అకాడమీ, కర్ణాటక పల్మనాలజీ అసోసియేషన్‌లు మద్దతు ప్రకటించారు. డాక్టర్ కేఎస్ సతీశ్ సదస్సును ప్రారంభించగా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పనామా రోబోటిక్స్‌కు ఐదుగురు విద్యార్థులు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి పనామాలో జరిగే అంతర్జాతీయ రోబోటిక్స్ వేదికకు ఐదుగురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. స్టెమ్ ఎడ్యుకేషన్ ట్రస్టు, రేవా యూనివర్సిటీ ఇన్నోవేషన్స్ ద్వారా పంపుతున్నారు. ఈనెల 29నుంచి పనామాలో కార్యక్రమం జరగనుంది. ఇకో ఈక్విలిబ్రియం కింద తయారైన రోబో నమూనాలు, రక్షణ, జీవవైవిధ్య సంరక్షణను ప్రయోగాత్మకంగా సమస్యలు పరిష్కరించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారు. ఇండియా కోఫంట్ జనరల్ పార్ట్‌నర్, స్టెమ్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఫౌండర్ గగన్ గోయెల్, రేవా యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ పీ శ్యామరాజు విద్యార్థులను అభినందించారు. ఎంపికైనవారిలో నింగరాజు, పరశురామ్, అర్జున్, గౌరేశ్, చందన్‌లు ఉన్నారు. భారత సామర్థ్యాన్ని చూపేలాంటి స్థానిక రోబోను రూపొందించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్, అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్, మార్కెట్ ప్లేస్ ల్యాబ్స్, స్టెమ్ ఎడ్యుకేషన్ ట్రస్టులు సహకరించాయి.



రోబో నమూనా, ఎంపికైన విద్యార్థులతో ప్రముఖులు

స్థానిక యాప్‌లకు ఆటో, క్యాబ్ డ్రైవర్ల మద్దతు



మాట్లాడుతున్న ట్యాక్సీ డ్రైవర్ల సంఘం నేత మంజునాథ్ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు, హుబ్బళ్ళి, మంగళూరులకు చెందిన ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాలకు చెందిన 10వేల మందికిపైగా డ్రైవర్లు రవాణా రంగంలో స్థానిక యాప్‌లకు మద్దతు ఇస్తున్నారు. 'ఓకల్ ఫర్ లోకల్' అనే క్యాంపెయిన్‌కు తమ మద్దతును ప్రకటించారు. నగరంలో సంఘం సభ్యులు మీడియాతో మాట్లాడుతూ ఆటో, క్యాబ్‌లను బాడుగకు పొందే ప్రయాణీకులకు వీలుగా ఇంటర్నెట్‌లో వ్యవస్థీకృతమైన సమాచారంతో స్థానిక యాప్‌లకు మద్దతు ఇవ్వదలిచినట్టు తెలిపారు. ఆదర్శ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్‌ల సంఘం సమాఖ్య మంజునాథ్ మాట్లాడుతూ ప్రయాణీకులకు సులభంగా ఉన్న 'నమ్మ యాత్రి' యాప్ వంటివాటిని వినియోగిస్తున్నామన్నారు. విదేశీ యాప్‌లు ప్రారంభంలో బాగున్నా క్రమేపీ వాటివల్ల ఆదాయం ప్రోత్సాహకంగా లేదన్నారు. పీస్ ఆటో ముఖ్యులు రఘు మాట్లాడుతూ బైక్ ట్యాక్సీలకు చట్టపరంగా అనుమతి లేదన్నారు. చట్టవ్యతిరేకంగా తాము ముందుకు సాగేది లేదని 'నమ్మయాత్రి' యాప్ డ్రైవర్‌లకు భరోసా ఇస్తోందని అందుకే తాము మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. కొంతమంది 12-14 గంటలపాటు వాహనం నడుపుతారని అందుకు తగిన రీతిలో ప్రోత్సాహకమైన ఆదాయం లేకుంటే ఎలాగన్నారు. మీడియా సమావేశంలో వివిధ సంఘాల క్యాబ్ డ్రైవర్‌లు పాల్గొన్నారు.

పర్యావరణంపై మరిన్ని వ్యాసాలు



సదస్సులో ప్రముఖులు

చిక్కబళ్ళాపుర, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యావరణం, వ్యవసాయాన్ని ప్రోత్సహించే వ్యాసాలు చాలా ఉపయోగకరమని ఇటువంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఫాక్స్‌కో లిమిటెడ్ చైర్మన్ సతీశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణ శివారులోని నాగార్జున టెక్నికల్ కళాశాలలో వివిధ సంస్థలతో కలసి ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ నాగప్పన్ అభిప్రాయపడ్డారు. సదస్సులో 14 దేశాలనుంచి 191 పత్రాలను సమర్పించారు. కళాశాల సీనియర్ డైరెక్టర్ ఎస్‌జీ గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌పీ రోడ్డు హబ్బ ముగింపు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఎలక్ట్రానిక్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌పీ రోడ్డు హబ్బ నెల రోజులపాటు నిర్వహించామన్నారు. ఎస్‌పీ రోడ్డుకు దశాబ్దాల చరిత్ర ఉందని 60ఏళ్లక్రితం అసోసియేషన్ ఏర్పడిందని నిర్వాహకులు తెలిపారు. ఎస్‌పీ రోడ్డు హబ్బలో జీఎస్టీ 2.0 ద్వారా వినియోగదారులకు ఏమేరకు లబ్ధి ఉందో తెలియపరిచేలా శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, రాజ్యసభ సభ్యుడు లెహర్‌సింగ్ సిరోయ, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, ఎమ్మెల్సీ భారతిశెట్టితోపాటు పలువురు పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి అరుణ్ నునావత్ ప్రకటించారు. నెల రోజులపాటు సాగిన హబ్బలో ఆకర్షణీయమైన బహుమతులను విజేతలకు లాటరీ రూపంలో ఎంపిక చేస్తామన్నారు.



మీడియాతో చలవాది నారాయణస్వామి తదితరులు

పట్టుతో రైతులకు ఆర్థిక బలం: కేంద్రమంత్రి

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమతో రైతులకు ఆర్థిక బలం అని కేంద్రమంత్రి శోభాకరంద్లాజె అభిప్రాయపడ్డారు. కేంద్రపట్టు మండలి - నేషనల్ సిల్క్‌వార్మ్ సీడ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సువర్ణ మహోత్సవం జరిగింది. నిమ్హాన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం కార్యక్రమం కొనసాగింది. 50ఏళ్ల వ్యవధిలో పట్టు పురుగుల పెంపకానికి సంబంధించి సాగిన ప్రగతిపై మాట్లాడారు. బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, కేంద్ర పట్టుమండలి సీఈఓ శివకుమార్, సిల్క్‌వార్మ్ సీడ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ డాక్టర్ మంధి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సువర్ణ మహోత్సవ వేదికపై ప్రముఖులు

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హతతోపాటు ప్రతిభ ఉన్నవారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి శోభాకరంద్లాజె అభిప్రాయపడ్డారు. నగరంలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో పాల్గొని అభ్యర్థులకు నియామకపత్రాలు అందచేశారు. వర్చువల్ రూపంలో ప్రధాని నరేంద్రమోదీ భాగస్వాములయ్యారు. 17వ రోజ్‌గార్ మేళాలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, ఎంపీ పీసీ మోహన్, పోస్టల్‌సేవల్ డైరెక్టర్ సందేశ్ మహదేవప్ప, నైరుతి రైల్వే సీనియర్ విభాగం మేనేజర్ ఉమా శర్మ, బీఎస్ఎఫ్ బెంగళూరు డిప్యూటి కమాండెంట్ అనిల్‌మీనా పాల్గొన్నారు. ప్రభుత్వ పని దేవుడి పనిగా భావించి విధులు నిర్వహించాలని, వృత్తిపట్ల అంకితభావంతో కొనసాగాలని అభ్యర్థులకు సూచించారు.



నియామకపత్రాలతో అభ్యర్థులు

చోరీ సొత్తు రికవరీ

» నిందితుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సొత్తు

బంగారపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని రామనాయకనహళ్ళి గ్రామం చౌడేశ్వరిదేవస్థానం చోరీ కేసును ఛేదించారు. చోరీకి ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని, నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు చోరీసొత్తును రికవరీ చేసినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ దయానంద్ వెల్లడించారు. కేజీఎఫ్ డీఎస్పీ లక్ష్మయ్య మార్గదర్శకంలో ప్రత్యేకబృందం ఏర్పాటు చేయగా కేసును ఛేదించారన్నారు. నిందితుడు సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుప్పం పట్టణంలో హోటల్ నిర్వాహకుడిగా గుర్తించామన్నారు. జే కార్తిక్ అలియాస్ డిష్ కార్తిక్ ఆలయంలో రెండు బంగారు తాళిబొట్టు, ఒక జత దీపస్తంభాలు, రెండు పూజ తట్టలు, ఒక గంట, ఇతర సామగ్రి చోరీకి పాల్పడ్డారన్నారు. చోరీ సొత్తుతోపాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసుల కార్యవైఖరిని కేజీఎఫ్ జిల్లా ఎస్పీ శివంశు రజపుత్ ప్రశంసించారు.

ఆక్రమణల తొలగింపు



పట్టణంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసిన దుకాణాలను తొలగించడంతో విశాలంగా కనిపిస్తున్న రహదారి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో దశాబ్దాలుగా వెలసిన ఆక్రమణలను తొలగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ తిప్పలు తప్పుతున్నాయి. సత్యసాయి శత జయంత్యుత్సవాల నేపథ్యంలో పోలీసులు మూడు రోజులుగా ఆక్రమణ లను తొలగింపజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం గణేష్ గేట్ ఎదురుగా ఫుట్‌పాత్‌ను అక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, బస్టాండు ఎదురుగా, గోపురం గేట్, గణేష్ గేట్, సత్యసాయి జనరల్ హాస్పిటల్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఆటోలను అడ్డంగా పార్కింగ్ చేయడంతో పుట్టపర్తికి వచ్చే భక్తులతోపాటు స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా పరిశీలించి, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ మేరకు డీఎస్పీ విజయ్‌కుమార్, పట్టణ సీఐ శివాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు.. ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు అపరాదని హెచ్చరించారు. బస్టాండు ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్‌ను సత్యమ్మ దేవాలయం వద్దకు తరలించారు. గణేష్ గేట్, గోపురం గేట్ ప్రధాన రహదారిపై ఆటోలను ఆపరాదన్నారు.

మరో 20 రోజుల్లో సుందర పుట్టపర్తి: ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్/కొత్తచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకల నాటికి పుట్టపర్తిని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరో 20 రోజుల్లో పనులు పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పడమటిగేట్ రోడ్డు అభివృద్ధికి రూ.1.4 కోట్లు, వీధిలైట్లు రూ.20లక్షలు, డ్రైనేజీ రిపేరీ, శానిటేషన్‌కు రూ.70లక్షలు, డీఎంఎఫ్, మునిసిపాలిటీ స్పెషల్‌గ్రాంట్ నిధుల ద్వారా మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు మరో రూ 1.5కోట్ల వ్యయం చేస్తున్నామన్నారు. శానిటేషన్ మరమ్మతు పనులు కోసం అదనంగా 20 మంది కార్మికులను నియమించినట్లు తెలిపారు. పట్టణంలో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.4కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. భద్రతా ఏర్పాట్ల కోసం రూ.1.16 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.

ఓంశక్తి దేవి విగ్రహ ప్రతిష్ఠ



విశేషపూజల్లో ఎమ్మెల్యే శివణ్ణ తదితరులు

దొమ్మసంద్ర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సర్జాపుర హోబళి ముత్తనల్లూరు గ్రామంలోని ఓంశక్తి ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, నవగ్రహహోమం, పంచగవ్య స్థాపన, నారాయణపంచసూత్ర హోమం, దుర్గాదేవి హోమం నిర్వహించారు. 108 కళశాలకు ప్రత్యేకపూజలు చేశారు. కుంభాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలలో ఎమ్మెల్యే బీ శివణ్ణ తదితరులు ముఖ్యులుగా పాల్గొన్నారు. పూజలలో గ్రామపంచాయతీ అధ్యక్షులు నాగరత్న కాంతరాజు, మాజీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, కృష్ణారెడ్డి, ఆలయ ముఖ్యులు సుజాత, సుదేవమ్మ, అణ్ణయ్య, శివరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామాంజనేయస్వామికి విశేష పూజలు



విశేష పుష్పాలంకరణ

శిడ్లఘట్ట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ముత్తూరు గ్రామంలో రామాంజనేయస్వామికి గురు, శుక్రవారాలలో విశేషపూజలు నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ, మహామంగళారతి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విశేషంగా తమలపాకుల సేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఉత్సవమూర్తిని మేళతాళాల నడుమ పురవీధులలో ఊరేగించారు.

సహజ కాన్పులను ప్రోత్సహించాలి: మంత్రి



సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి దినేశ్ గుండూరావ్ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సహజకాన్పులను ప్రోత్సహించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ అభిప్రాయపడ్డారు. డాక్టర్ జాహ్నవి నీలేకణి స్థాపించిన ఆస్త్రికా మిడ్‌వైఫరీ సెంటర్ (ఏఎంసీ)ను జేసీ రోడ్డులోని ట్రస్ట్‌వెల్ ఆసుపత్రికి అనుబంధంగా ప్రారంభించారు. ఆసుపత్రిలో వందకుపైగా వాటర్‌బర్త్‌లు, 700కుపైగా సాధారణ ప్రసవాలు నిర్వహించారన్నారు. ఏఎంసీ ప్రతితల్లి ఆరోగ్యంపై వ్యక్తిగత పర్యవేక్షణ చేపడుతోందన్నారు. నవజాత శిశువులకు ఎన్ఐసీయూ విభాగంతోపాటు నిరంతరం డాక్టర్ల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఢిల్లీ ఎయిమ్స్ గైనకాలజీ ప్రొఫెసర్ నీనా మల్హోత్రా మాట్లాడుతూ ఏడాది నుంచి ఏఎంసీ సేవలు పరిశీలిస్తున్నా అన్నారు. ట్రస్ట్‌వెల్ ఆసుపత్రి చైర్మన్ హెచ్‌వీ మధుసూధన్‌తోపాటు జాహ్నవి నీలేకణి, నందన్ నీలేకణి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమీక్షలో ఎమ్మెల్యే



వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

మహదేవపుర, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక విద్యా సమీక్షలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి దంపతులు పాల్గొన్నారు. గురువారం సర్వే ఎన్యూమరేటర్లు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వివరాలు సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న సర్వేలో తాము కూడా భాగస్వామ్యులైనట్టు ఎమ్మెల్యే మంజుళా తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	14,790	97,751
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	14,688	96,487
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.54

పంట నష్టపరిహారం ప్రకటించాలి

● కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్‌కు రైతుసంఘం వినతి ● వరద ప్రాంతాల్లో తక్షణమే సర్వే చేపట్టాలని డిమాండ్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేకేఎంఎస్ సభ్యులు

బళ్లారి సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు పంట నష్టపరిహారాన్ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాకలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐకేకేఎంఎస్(అఖిలభారత రైతు కృషి కార్మికుల సంఘం) నిరసన తెలిపింది. అనంతరం పలు డిమాండ్లతో జిల్లాకలెక్టర్ నాగేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈసందర్భంగా సంఘం జిల్లాధ్యక్షుడు గోవింద్, జిల్లాకార్యదర్శి గురల్లి రాజా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా చాల మంది రైతుల పంటలు నష్టపోయారన్నారు. ఎకరానికి 8 నుంచి 10క్వింటాళ్ల వరి నాశనమయ్యిందని, గత సంవత్సరం కూడా ఇలాంటి అకాల వర్షాల కారణంగా చాలా పంట దెబ్బ తినిందన్నారు. గత సంవత్సరం ఆరోజు దెబ్బతిన్న వరికి పరిహారం ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ కొద్దిమందికి మాత్రమే అందజేశారని, వేలాది మందికి చేరలేదన్నారు. చాలా మందకి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ సారి అలాంటి తప్పు జరగకుండా పకడ్బందీగా సర్వే చేపట్టాలని, ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఎకరానికి రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని, క్వింటాలు వరికి రూ. 3500 మద్దతు ధర ఇవ్వాలన్నారు. వరికోత మిషన్ గంటకు రూ. 2వేలు కంటే ఎక్కువ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని ,నవంబర్ మెదటి వారంలోనే వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సంఘం సభ్యులు హొన్నూర్‌స్వామి, హనుమంత,శ్రీనివాస్, ఆంజనేయ, దురుగన్న తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య


ఘటనా స్థలంలో రవికుమార్ మృతదేహం


రవికుమార్ (ఫైల్)

బళ్లారిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీసు స్టేషన్ పరిధిలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అసొండి గ్రామానికి చెందిన రవికుమార్(30) గురువారం రాత్రి సీడ్స్ కంపెనీలో పనులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. బళ్లారి నుంచి రాత్రి 9.30 గంటల నుంచి 10 గంటల సమయంలో వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి అన్న శేఖర్ పీడీ హళ్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఐ రుద్రప్ప, ఎస్ఐ తిమ్మారెడ్డి ఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన రవికుమార్ మృతదేహాన్ని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్య కేసుకు సంబంధించి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూతురిపై అత్యాచారం

● తల్లి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

బంగారపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కన్నకూతురిపై తండ్రి అత్యాచారానికి పాల్పడిన దారుణ సంఘటన కోలారు జిల్లా బంగారపేట పట్టణంలో చోటు చేసుకుంది. తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన నిందితుడు పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 19న మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో మూడేళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడినట్లు తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ ఆర్ దయానంద్ నేతృత్వంలో నిందితుడిని గురువారం అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

మాజీ ఎంపీపై కేసు నమోదుకు డిమాండ్

సిరుగుప్ప, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ మాజీ ఎంపీ రమేష్ విశ్వనాథ కత్తిపై అట్రాసిటీ కేసు దాఖలు చేయాలని వాల్మీకి సమాజం నాయకులు బీఎం సతీష్ కోరారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో రమేష్ కత్తి వాల్మీకి గురువులను నిర్లక్ష్యంగా మాట్లాడిన మాటలను వ్యతిరేకిస్తూ సీఐ హనుమంతప్పకు వినతిపత్రం అందజేశారు. వాల్మీకి సమాజంపై నిర్లక్ష్యంగా మాట్లాడటం తగదన్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి

● గర్భిణులకు సత్వర చికిత్స అందించాలి: డీహెచ్‌ఓ రమేశ్ బాబు


సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారిసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతాశిశు మరణాలను తగ్గించాలని, గర్భిణులకు చికిత్స అందించడంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి (డీహెచ్‌ఓ) రమేశ్‌బాబు సూచించారు. శుక్రవారం నగరంలోని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారుల హాల్లో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ బీఎంసీఆర్‌సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, క్షేత్ర సిబ్బంది నిర్వహించిన మాతృ మరణాలపై జిల్లాస్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో గర్భిణులు పాలిచ్చే తల్లుల మరణాలను సున్నాకి తీసుకురావాలని, తీవ్రమైన సమస్యలు గుర్తించినప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. చికిత్స అవసరమైతే మాత్రమే ఉన్నతస్థాయి ఆసుపత్రికి ముందుగానే సమాచారం ఇచ్చి అంబులెన్స్‌లో పంపాలన్నారు. ఇళ్ల వద్ద ప్రసవాలతో ఇబ్బందులను గ్రామాల్లో వివరించి, ఆస్పత్రికి తరలించేలా చూడాలన్నారు. మహిళ గర్భిణి అని తెలిసుకున్న రోజు నుంచి తలెత్తే తీవ్రమైన సమస్యలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంగా బీఎంసీఆర్‌సీ ప్రసూతి విభాగానికి చెందిన డాక్టర్ రామరాజ్, జిల్లాఆసుపత్రి ప్రసూతి వైద్యురాలు డాక్టర్ శ్రీలక్ష్మీ. ఇన్‌చార్జి జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఖుర్షీద్‌బేగం, డీఎన్‌ఓ గిరీష్, క్షేత్రస్థాయి వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

కంప్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిత్యం కళాశాల, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదంగా ప్రయాణిస్తున్నారు. కుడితిని నుండి బళ్లారికి వెళ్లే విద్యార్థులు ఉదయం సమయంలో సరిపడా బస్సులు లేకపోవడం, కాలేజీకి సమయానికి వెళ్లాలనో ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్నారు ఒకటో రెండో వచ్చిన బస్సులకే ఫుట్‌బోర్డు పై 20 కిలోమీటర్లు బళ్లారి వరకు విద్యార్థులు కొనసాగిస్తున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు బళ్లారికి వెళ్లేందుకు బస్సులు కోరుతూ వుండటంతో విద్యార్థులు ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుడితిని చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ద్విచక్ర వాహనాలపైన కుడితిని పట్టణానికి చేరుకుని అక్కడి నుండి కాలేజీలకు చేరుకుంటున్నారు. ప్రత్యేక బస్సులు నడిపి విద్యార్థులకు సమస్య తలెత్తకుండా చూడాలని వారు కోరుతున్నారు.

హంపికి కార్తీక శోభ

కంప్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం అనగానే శివాలయాలు భక్తులతో కిటకిటలాడడం, ఆలయాల్లో జ్యోతులు వెలిగించడం తెలిసిందే. దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు. దక్షిణ కాశీగా పేరుపొందిన హంపి పుణ్యక్షేత్రంలో దీపావళి మొదలుకొని పలు ఆలయాల్లో, మండపాలలో దీపాలు వెలిగిస్తుండంతో కార్తీక శోభ కనిపిస్తోంది. గురువారం రాత్రి ఏకశిలా రథం వద్ద సాయంత్రం వేళల్లో జ్యోతులను వెలిగిస్తూ మహిళలు భక్తిని చాటుకున్నారు. విరుపాక్షేశ్వర స్వామి, పార్వతి, భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తునానరు. కార్తీక మాసం విరూపాక్షేశ్వరుడి సన్నిధి భక్తులతో కిటకిటలాడనుంది.


విరుపాక్షేశ్వరుడి సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


ఏకశిలా రథం వద్ద..

నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

● మరమ్మతు పనులు, గోతులతో ఇబ్బందులు
● ఇష్టానుసారం ఫ్లెక్సీలు కడుతున్నా పట్టించుకోరా?
● అధికారులపై బీజేపీ నాయకుల మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బళ్లారి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో అధికార పార్టీ నాయకులు రోడ్ల మరమ్మత్తుల పేరుతో ట్రాఫిక్ కు ఇబ్బంది కల్గిస్తున్నారని. కాంగ్రెస్ నాయకుడి జన్మదిన సందర్భంగా నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని శుక్రవారం ఎస్పీ, నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. శుక్రవారం బళ్లారిలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అద్యక్షుడు అనీల్ కుమార్ నాయుడు, సీటీ అద్యక్షుడు గుర్రం వెంకటరమణ, ఇతర బీజేపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బళ్లారి నగరంలో రోడ్ల అభివృద్ధి పేరుతో ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు, గోతులు వాహనదారులకు ఇబ్బందిగా మారాయన్నారు. దీని కారణంగా ప్రజలకు చాలా ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఒక రోడ్డు మరమ్మత్తులు చేశాక మరో రోడ్డు అభివృద్ధి పనులు చేస్తే బాగుంటుందన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకుడి జన్మదిన సందర్భంగా ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా అధికారుల చర్యలు తీసుకోవడం లేదన్నారు. నగర సమస్యలపై ఫిర్యాదు చేస్తామన్నారు. వీరితోపాటు కార్పొరేటర్లు, కొందరు బీజేపీ నాయకులు ఉన్నారు.


వాహనాలను ప్రారంభిస్తున్న జడ్పీ కార్యదర్శి శశికాంత్ శివపురే

మహిళలకు శిక్షణ ప్రారంభం

బళ్లారి సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలకు సమానత్వం కల్పించడానికి వివిధ ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని జిల్లాపంచాయతీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే అన్నారు. శుక్రవారం నగరంలోని కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రాంగణంలో మహిళలకు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభించారు. జిల్లాపంచాయతీ సహకారంతో ఎన్‌ఆర్‌ఎల్‌ఎం పథకం కింద ఘన, ద్రవ వ్యర్థాల యూనిట్ల వాహనాల కోసం ఎస్‌హెచ్‌జీ మహిళలు ,పురుషులకు నాలుగు చక్రాల తేలికపాటి వాహన డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో మహిళా డ్రైవర్లను ఎంపిక చేస్తారు. ధైర్యంగా ఎలా నడపాలో నేర్చుకోవడంలో వారు ఆసక్తి చూపాలని అన్నారు. యువత జీవనోపాధి కోసం స్వయం ఉపాదిగా తేలికపాటి వాహనాలు నడపాలని ఆయన అన్నారు.

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేసాబ్ ఎరిమణి మాట్లాడుతూ ఈసంస్థ నైపుణ్య శిక్షణతోపాటు వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం,స్వయం ఉపాధి కోసం మార్గదర్శకత్వాన్ని అందిస్తుందని అర్హులైన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమంలో మహిళల పాత్ర చాలా ముఖ్యమైనదని, ప్రస్తుతం మహిళలకు అన్నిరంగాలలో అవకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వారు ఉపయోగించుకోవాలని జిల్లాపంచాయతీ మేనేజర్ విజయ్ కుమార్ అన్నారు. ఈసందర్భంగా బళ్లారి టీపీ తాలూకా మేనేజర్ గంగాధర్, లెక్చరర్లు జడేషా, దినేశ్ కుమార్‌చ, సిద్దలింగమ్మ, సంతోష్‌కుమార్, పరమేశ్, సంస్థ సిబ్బంది, 27మంది క్యాంపర్లు పాల్గొన్నారు.


ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి

● జేడీఎస్ నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న జేడీఎస్ తాలుకా అధ్యక్షుడు శివనారాయణ

సిరుగుప్ప, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు పంట నష్ట పరిహారం చెల్లించాలని జేడీఎస్ పార్టీ తాలుకా అధ్యక్షుడు శివనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరుగుప్ప తాలుకాలోని భారీ వర్షాల కారణంగా బాగేవాడి, ఇబ్రహీంపురం, ఉడదరాళు, మన్నూరు, సూగూరు, నడివి, కెంచన గుడ్డ తదితర ప్రాంతాలలో భారీ వర్షాలతో వరి పంట, పత్తి, మిరప పంటలు భారీగా దెబ్బతిని రైతులు నష్టాలపాలయ్యారు. తాలుకాలో దాదాపు 30 వేల ఎకరాలలో వరి పంట దెబ్బతింది. బాగేవాడి గ్రామంలో కెంచప్ప అనే రైతు ఎనిమిది ఎకరాల వరి పంట పూర్తిగా నేలమట్టం కావడంతో రైతు ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ఈ సందర్భంగా ప్రముఖ రైతులు పంపన్న, హనుమంతప్ప, యల్లప్ప, కెంచపప్ప పాల్గొన్నారు.

ఘనంగా గేదెల ఊరేగింపు


ముద్దాపురంలో గేదెలను ఊరేగిస్తున్న దృశ్యం

కంప్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని నెంబర్ టెన్ ముద్దాపురం గ్రామంలో గౌలేరు సమాజ ప్రజలు గేదెల ఊరేగింపు వైభవంగా జరుపుకున్నారు. దీపావళి తర్వాత సమాజ ప్రజలు ఊళ్లో గేదెలను ఊరేగించి పండగ జరుపుకుంటారు. ఉదయం గేదేలకు స్నానాలు చేయించి, పుష్పాలతో ముస్తాబు చేసి, కొమ్ములకు రంగులు వేసి గ్రామంలో ఊరేగిస్తారు. జిల్లాలోని ముద్దాపురంలోనే ఈ పండగ ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఇండ్ల ముందు భాగంలో ప్రతి ఒక్కరు ఐదు విగ్రహాలు ఏర్పాటు చేసుకుని విగ్రహాలకు పుష్పాలు ఉత్తిరేణి ఆకు తంగడి పూలతో ఐదు పూజలు చేస్తారు. ఇలా పూజలు చేస్తే సకాలంలో వర్షాలు కురిసి, పంటలు పండుతాయని వారి నమ్మకం.


పాండవ విగ్రహాలకు నమస్కరిస్తున్న గేదె

హోసూరు జోన్

తాటి విత్తనాలు నాటిన కలెక్టర్


విత్తనాలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

హోసూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో వేపనపల్లి పంచాయతీ యూనియన్ బిల్లనకుప్పం పంచాయతీలోని వసంతపల్లి చెరువు నది ఒడ్డున జెయింట్ తాటి విత్తనాలను నాటే పనిని కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఒక జిల్లాలో అడవులు, చెట్ల విస్తీర్ణం 33 శాతం ఉండాలి. కృష్ణగిరి జిల్లాలో 31 శాతం మాత్రమే ఉండడంతో వివిధ కారణాల వల్ల చెట్లను నరికివేస్తే పర్యావరణానికి చాలా నష్టం జరుగుతోంది, వాటిని నివారించడానికి జిల్లా యంత్రాంగం వివిధ ప్రయత్నాలు చేస్తోంది. కొన్ని నెలలుగా సీఎస్ఆర్ నిధులకింద వివిధ సంస్థలు మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం దీని కోసం భూమిని అందిస్తోంది, అలాగే, జిల్లా తరపున మద్దూర్‌లో ఒక తాటి విత్తన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. తమిళనాడులో మొట్ట మొదటి తాటి విత్తన క్షేత్రం. ఉపాధిహామీ పథకం కింద ఒకే రోజులో మొత్తం 1,50,000 తాటి విత్తనాలను నాటుతున్నారు. వసంతపల్లి సరస్సు ఒడ్డున 600 తాటి విత్తనాలను నాటుతున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, జిల్లా వన్యప్రాణుల సంరక్షణ అధికారి జగదీశ్ సుధాకర్, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాజా మరియప్పన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణి తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డుపై పెరిగిన ట్రాఫిక్

హోసూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమిళనాడు-కర్ణాటక సరిహద్దులోని కృష్ణగిరి జిల్లాలో హోసూరు నగరం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఆ స్థాయిలో రోడ్డు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు సరిపోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హోసూరు నగరం చుట్టూ వివిధ రోడ్డు మౌలిక సదుపాయాలను కల్పిస్తూ బెంగళూరును అనుసంధానం చేస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి -నెరళూరు రోడ్డు, శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయి. హోసూరు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి సీతారామయ్యమేడు నుంచి ఈఎస్ఐ హాస్పిటల్ వరకు 8 కి.మీ వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించబడింది. ఈ రహదారి ముల్లై నగర్, టెంపుల్ హడ్కో , భారతీదాసన్ నగర్, పెరియార్ నగర్, శాంతినగర్, మునీశ్వర్ నగర్, ద్వారకా నగర్, కొత్తూరు, మూకొండపల్లి, ఎన్టీఆర్‌నగర్ వంటి వివిధ ప్రాంతాలను కలుపుతోంది. ఇది డెంకణీకోట రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, తళి రోడ్డును కూడా కలుపుతోంది. ఆర్‌సి చర్చ్ నుంచి ఫిష్ మార్కెట్ వరకు చాలా చోట్ల రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


గుంతలమయమైన రహదారి

బాలికలు అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయం

● అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో న్యాయాధికారి రాజేశ్ హొసమనె


చిన్నారితో కేక్ కట్ చేయిస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సమాజంలో పురుషులు, మహిళలు రెండు కళ్లు లాంటివారని, ఇటీవలీ కాలంలో బాలికలు అన్నిరంగాల్లో విజయాలు సాధించడం హర్షణీయమని సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయ సేవల ప్రాధికార సంస్థ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, పాఠశాల విద్యాశాఖ, పోలీసు శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'బేటీ బచావో బేటీ పడావో' ప్రచారం కింద అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం నగరంలోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంబించి మాట్లాడారు. దేశ రాష్ట్రపతి, మన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఇతర ఉన్నత పదవుల్లో రాణించడం గొప్పతనమన్నారు. ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సింధూన్‌ను కూడా మహిళలు ముందుండి నడిపించడం గర్వకారణమన్నారు. విద్య, సమానత్వం, ప్రాథమిక సౌకర్యాలు అందించడం మనందరి కర్తవ్యం అన్నారు. నేటి కాలంలో బాలికలపై బాల్య వివాహాలు, ఆడ భ్రూణహత్యలు, లైంగిక దోపిడీ, లింగ వివక్షత ఇతర దరుణాలు జరగుతున్నాయని, మనమందరం కలిసి వీటిని ప్రోత్సహించకుండా నిరోధించాలన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలు సౌకర్యాలను పొందడం ద్వారా బాలికలు ఆర్థికంగా సాధికారత సాధించాలన్నారు.

మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ 'బేటీ బచావో బేటీ పడావో' అనేది భారత ప్రభుత్వం యొక్క సామాజిక ప్రచారం అని, దీని ప్రధాన లక్ష్యం దేశంలో ఆడపిల్లలకు బాలికలకు సమాన విద్యావకాశాలు కల్పించడమేనన్నారు. తగ్గుతున్న బాలికల లింగ నిష్పత్తిని మెరుగుపరచడం అని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈపథకాన్ని జనవరి 22, 2015న హర్యానాలోని పానిపట్‌లో ప్రారంభించారన్నారు.ఈకార్యక్రమంలో ఆడపిల్ల జననాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి తల్లులకు బేబీ కిట్లు పంపిణీ చేశారు. మాతృ వందన యోజన పోస్టర్లను ప్రముఖులు అవిష్కరించారు. అదనపు ఎస్పీ నవీన్‌కుమార్, డాక్టర్ బసారెడ్డి, డీహెచ్‌ఓ రమేశ్‌బాబు, ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప, విద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా బాలల రక్షణ అధికారి సుభద్రాదేవి, సవిత, ప్రాజెక్టు అధికారి మోహన్‌కుమారి, వైద్య అధికారులు డా. విశ్వనాథ్, డా.విమల, వైద్య అధికారులు, కార్యాలయ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

పంటల బీమాకు నెలాఖరు వరకు గడువు

హోసూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలోని రైతులు పంటల బీమా పథకానికి ఈనెలాఖరు వరకు గడువు ఉందని హోసూరు జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు భువనేశ్వరీ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఖరీఫ్, స్పెషల్, రబీ సీజన్లకు తమిళనాడులోని అన్ని జిల్లాలో ప్రధాన మంత్రి వ్యవసాయ బీమా యోజన అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యాధులు, కరువు, తుపాను, వడగళ్ల వాన, కొండచరియలు విరిగిపడటం, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే బీమా వల్ల రైతులకు నష్ట పరిహారం లభిస్తుందన్నారు. బీమా పథకంలో చేరవచ్చని, పంట రుణాలు మరియు వ్యవసాయ ఆభరణాల రుణాలు పొందుతున్న రైతులందరూ చేరవచ్చని తెలిపారు. రైతులు బీమా మొత్తంలో 2 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సేవా కేంద్రాలు, ప్రాథమి వ్యవసాయ సహకార సంఘాలు, బ్యాంకుల ద్వారా పంటలబీమా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు.